ప్రజాశక్తి
సోమవారం 1 సెప్టెంబర్ 2025
5
విజయనగరం

ఆకతాయిల భరతం పట్టేందుకే శక్తి బృందాలు

ఎస్పి వకుల్ జిందల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఆకతాయిల భరతం పట్టేందుకు శక్తి బృందాలను ఏర్పాటుచేశామని ఎస్పి వకుల్ జిందల్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కొక్క బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయని తెలిపారు. శక్తి ఎస్ఒఎస్ కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను ఈ బృందాలు మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తిస్తాయని, వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ బృందాల పని తీరును అదనపు ఎస్పి పి.సౌమ్యలత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు.

కుదేలైన పరిశ్రమలు

- జీవనోపాధి కోల్పోతున్న వేలాది కుటుంబాలు
- వలస పోతున్న యువత
- వినతులు, ఆందోళనలను పట్టించుకోని ప్రభుత్వం

అసలే విజయనగరం జిల్లా అత్యంత వెనుకబాటు. అందులోనూ పారిశ్రామిక వృద్ధి మరింత అధమం. ఇటువంటి పరిస్థితుల్లో పరిశ్రమలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం గనులు కేటాయింపులు, విద్యుత్ రాయితీలు వంటివి చేయకపోవడంతో ఉన్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. దీంతో, పారిశ్రామిక రంగం మరింత కుదేలైంది. ఫలితంగా జీవనోపాధి కోల్పోయిన కార్మికులు, ఉద్యోగులు పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ముఖ్యంగా జిల్లాలో ఇటీవల ఏడు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ప్రాంతంలో మైన్స్, ఎస్ కోట ప్రాంతంలో 10 క్వారీలు మూతపడుతున్నాయి. ఫలితంగా సుమారు 15 వేల మంది కార్మికులు ఉపాధిపోయి రోడ్డున పడ్డారు. నడుస్తున్న పరిశ్రమల్లో కూడా 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించకుండా స్థానికేతరులతో పనిచేయిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పరిశ్రమలు మూతపడటమే కానీ కొత్త పరిశ్రమ ఒక్కటీ రాలేదు. దీంతో, జిల్లాలో వ్యవసాయ, సేవా రంగాలతో పోలిస్తే పారిశ్రామిక రంగం వృద్ధి చాలా అధమంగానే ఉంటోంది. 2021-22లో రూ.4,940 కోట్ల మేర ఉన్న వార్షిక ఆదాయం 2022-23 నాటికి రూ.7,545 కోట్లకు పెరిగినప్పటికీ 2023-24 నాటికి రూ.6.604 కోట్లకు ఆదాయం తగ్గింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



లాకౌట్ విధించిన జిందాల్ పరిశ్రమ

ఫేకర్ (ఫెర్రో ఎల్లాయిస్ ఫ్యాక్టరీ) కారణంగా మూడు దశాబ్దాల క్రితం వరకు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కళకళలాడిన గరివిడి ప్రాంతం నేడు వెలవెలబోతోంది. మాంగనీస్ గనులు కేటాయించకపోవడం, విద్యుత్ రాయితీలు తగినంతగా లేకపోవడం వల్ల క్రమంగా ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయింది. చివరికి 2023 నవంబర్‌లో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. ప్రస్తుతం అక్రమ తొలగింపులు మొదలయ్యాయి. గడిచిన ఏడాదిలోనే సుమారు 300 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గరివిడి, గుర్ల మండలాలకు చెందిన దేవాడ, సదానందపురం మాంగనీస్ గనుల లీజు కాలపరిమితి ఈ నెల 14వ తేదితో పూర్తికానున్నాయి. ఫలితంగా ఇక్కడ మరికొన్ని పరిశ్రమల్లో సెప్టెంబర్ 15 నుంచి ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే మరో వెయ్యి మంది కార్మికులకు ఉపాధి గల్లంతు కానుంది. కొత్తవలస మండలంలో జిందాల్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను 2025 జూన్‌లో మూసేశారు. 400 మంది కార్మికులకు ఉపాధి పోయింది. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఇంపెక్స్ సహా మరో 4 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటంతో 1500 మంది ఉపాధికి గండిపడింది. మెరకముడిదాం మండలం గర్భాంలో ఆంధ్ర ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను 2020లో మూసేయడంతో 600 మంది ఉపాధి పోయింది. ఆరు నెలల క్రితం గజపతినగరం నియోజకవర్గం మరుపల్లి వద్ద ఓలం జీడి పిక్కల పరిశ్రమను మూసేశారు. ఫలితంగా 600 మంది జీవనోపాధి కోల్పోయారు. జామి మండలం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ మూతకారణంగా 400 మంది, చిన్నాపురం ఎ.ఎస్ జ్యూట్ మిల్లు మూసివేతతో 700 మంది ఉపాధికి దూరమయ్యారు. శృంగవరపుకోట ప్రాంతంలో వివిధ కారణాలతో 10 క్వారీలు మూతపడ్డాయి. ఫలితంగా 800 మంది ఉపాధికి దెబ్బతగిలింది. వీటితోపాటు చిన్నాచితకా పరిశ్రమలు జిల్లా అంతా కలిపి 50 వరకు మూతపడ్డాయి.

చీపురుపల్లి మండలం కర్లాంలో వెయ్యి మంది పనిచేస్తున్న వెంకట్రామ పౌల్ట్రీలో స్థానికులను తొలగించి స్థానికేతరులైన ఒడిశా, చతీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన వారితో పని చేయించుకుంటున్నారు. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో నడుస్తున్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో హిందీ రాష్ట్రాలకు చెందిన వారితో పని చేయిస్తున్నారు. అనేక పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకు ఉపాధి ఇవ్వాలనే చట్టాన్ని అమలు చేయడం లేదు. మొత్తంగా జిల్లాలో పరిశ్రమలు మూతపడడం, నడుస్తున్న చోట్ల కూడా స్థానికులకు ఉపాధి కల్పించకపోవడంతో ఈ కాలంలో సుమారు 15 వేల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జిల్లాలో ఉపాధి లేక యువతీ, యువకులు వలస పోతున్నారు. ఇదే విషయమై జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత దృష్టికి సిఐటియు, సిపిఎం నాయకులు పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా స్పందించి మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, వాటిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

మూతపడ్డ పరిశ్రమలను తెరిపించాలి

మంత్రులు, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు కృషిచేయాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మా తరపున సిఐటియు నాయకత్వంలో పలుమార్లు మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశాం. సానుకూలంగా స్పందించినా, ఆచరణ అందుకు తగ్గట్టుగా లేదు. దీంతో జిల్లాలో వలసలు, పెరుగుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో జిల్లా వృద్ధిరేటు ఏటా 15శాతం పెంచడమంటే ఇదేనా? స్వర్ణాంధ్ర - విజన్ -2047 మాటలకు, లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

తనను కలిసేందుకు వచ్చిన మంత్రి శ్రీనివాస్, జిల్లా నాయకులతో మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్

గోవా గవర్నర్ అశోక్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజుకు ఘనస్వాగతం లభించింది. గవర్నర్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా ఆదివారం జిల్లాకు విచ్చేశారు. ఆయనకు స్థానిక అశోక్ బంగ్లా వద్ద ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బంగ్లాకు చేరుకొని, అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 పిఎసిఎస్‌లకు పాలకవర్గాల ఏర్పాటు

2536 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ : జిల్లా సహకార అధికారి రమేష్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఉన్న 65 పిఎసిఎస్‌లకు గాను 50 చోట్ల పాలక వర్గాలను ప్రభుత్వం నియమించినట్లు జిల్లా సహకార అధికారి పి.రమేష్ తెలిపారు. మిగిలిన 15 సొసైటీలకు నాన్ అఫీషియల్ పాలకవర్గాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పిఎసిఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పిఎసిఎస్‌ల్లో ఆడిట్ జరుగుతుందన్నారు. ఇంతవరకు పది పిఎసిఎస్‌ల్లో ఆడిట్ పూర్తయిందన్నారు. కంప్యూటరీకరణ జరిగితే ఆన్‌లైన్ పిఎసిఎస్‌ల సమాచారం ఉంటుందని తెలిపారు. ధాన్యం సేకరణ నవంబర్‌లో ప్రారంభం అవుతుందన్నారు. ఎస్‌టిఐ ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు. 65 పిఎసిఎస్‌ల ద్వారా 2536 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేశామని చెప్పారు. యూరియా 1548 మెట్రిక్ టన్నులు, డిఎపి 902 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 86 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు. పిఎసిఎస్‌ల్లో ఎరువులను నిబంధన ప్రకారం పంపిణీ చేయాలని, లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పిఎసిఎస్ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందని, దాన్ని త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు

అధ్వానంగా తయారైన రోడ్డు

పేరుకే నగరం.. రోడ్లు అధ్వానం

రాళ్లు తేలిన రహదారితో అవస్థలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్.. పేరుకు నగరపాలక సంస్థ. రోడ్లయితే స్థాయి స్థాయికి తగ్గట్టు లేవు. పల్లెల రహదారుల కంటే అధ్వానంగా ఉన్నాయి. నగరంలో మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, అన్ని శాఖలు అధికారులు ఉన్నారు. రోజూ అదే రోడ్లపై ప్రయాణిస్తున్నారు తప్ప పట్టించుకునే వారు కరువయ్యారు. నిత్యం వేలాదిమంది వెళ్లే బాలాజీ మార్కెట్ రోడ్డు వైపు వెళ్లాలంటే, వాహనాల కంటే నడిచి వెళ్లడం మేలన్న విధంగా రోడ్డు తయారైంది. గోతులు, రాళ్లు తేలిపోయి ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. రోడ్డు విస్తరణ పేరుతో ఏళ్ల తరబడి సాగతీతే తప్ప విస్తరణ పనులు చేపట్టక పోవడం వల్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. వారం రోజుల్లో రెండు ఆటోలకు చక్రాలు విరిగిపోయాయి. గోతుల్లో మూడు బైక్‌లు పడి వాహనదారులకు గాయాలయ్యాయి. జిల్లా అధికార యంత్రాంగం, పాలకులు ఆ రోడ్డు వెంట తిరుగుతున్నారు. అంతేతప్ప రోడ్డు పని పూర్తి చేయకపోవడంతో వాహన దారులు అనేకఇబ్బందులు పడుతున్నారు.

2న సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ నెల రెండో తేదిన పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైసిపి నగర, మండల అధ్యక్షులు ఆశపు వేణు, కెల్ల త్రినాథరావు తెలిపారు. ఆదివారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలో చెన్నై షాపింగ్ మాల్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వి.వి రాజేష్, ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, ఎంపిపి మామిడి అప్పల నాయుడు, బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, అవనాపు లక్ష్మణరావు, బండారు ఆనంద్, రంగ, పిన్నింటి సూర్యనారాయణ, బాల బ్రహ్మరెడ్డి, ఈసరపు రామకృష్ణ, బాలి కృష్ణారావు, బోడసింగి ఈశ్వరరావు, రంగిరెడ్డి సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

జ్ఞానసాధనకు తొలి సోపానం గురువు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాజును సత్కరిస్తున్న గురుప్రసాద్, సుబ్బారావు

జ్ఞాన సాధనకు తొలి సోపానం గురువేనని సుపథ రూపకర్త యువిఎన్ రాజు తెలిపారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం పూల్‌బాగ్‌లోని కుసుమంచి కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సద్గురువు బోధనలతోనే సుస్థిరత సాధ్యమని చెప్పారు. కార్యక్రమాన్ని కుసుమంచి సుబ్బారావు, డాక్టర్ పి.స్వప్న హైందవి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలోని 50 మంది ఉపాధ్యాయులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, కుసుమంచి సుబ్బారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ, ఉపాధ్యక్షులు పిన్నింటి కళావతి, ఎన్.దామోదర్ రావు, డాక్టర్ శశికళ, డాక్టర్ శిరీషా, డాక్టర్ గొట్టాపు లక్ష్మణరావు, ఎస్.గిరిజా ప్రసన్న, ధవళ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో ఆదివారం రక్తపోటు, మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జనసేన సేవాదళ్, జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యాన ఈ శిబిరం ఏర్పాటుచేశారు. డాక్టర్స్ ప్లాజా, శ్రీనివాస నర్సింగ్ హోం సహకారంతో డాక్టర్ వేణుగోపాల రెడ్డి బృందం పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బొబ్బాది చంద్రునాయుడు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు, శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ పాల్గొన్నారు.

వెన్నెముక విరిచేస్తున్నారు

యూరియా కోసం రైతుల పడిగాపులు

రైతేరాజు, రైతే దేశానికి వెన్నెముక.. అంటూ బాకాలూదే పాలకులు.. నెల రోజులుగా ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదు. వరి నాట్లు పూర్తి చేసిన రైతులు ఎక్కడికక్కడ ఎరువుల కోసం నేటికీ నానా అగచాట్లు పడుతున్నారు. ఎరువుల కోసం ఎదురు చూస్తున్న రైతులు... కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నిరాశకు గురౌతున్నారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో యూరియా, డిఎపి అందుబాటులో లేకపోవడంతో ఎరువుల కోసం ప్రయివేటు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుగా వారు అదనంగా వసూలు చేస్తూ రైతుల్ని దోపిడీ చేస్తున్నారు.

- ప్రజాశక్తి, నెల్లిమర్ల, గుర్ల, బొబ్బిలిరూరల్

గుర్ల.. యూరియా కోసం బారులు తీరిన రైతులు

పావువంతు కూడా రాలేదు

గుర్ల మండలంలో రైతులకు ఎరువుల పాట్లు తప్పడం లేదు. వరినాట్లు వేసి 20 రోజులు కావస్తున్నా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో పంట దిగుబడి తగ్గి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 25 వేల రైతులు 10 వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. మండలానికి 1156 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 174 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చినట్లు వ్యవసాయ అధికారి తిరుపతిరావు చెబుతున్నారు. డిఎపి 600 మెట్రిక్ టన్నులకు గాను ప్రస్తుతానికి 337 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు తెలిపారు. పావువంతు కూడా ఎరువులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రయివేట్ డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్ముతున్నా కొనక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఎరువుల కొరత తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బొబ్బిలి.. ఎరువుల కోసం ఎఒ కార్యాలయానికి వచ్చిన రైతులు

నాట్లు వేసి నెల రోజులైంది

బొబ్బిలి మండలంలో వరినాట్లు వేసి నెల రోజులైంది. ఇంకా ఎరువులు దొరక్క పోవడంతో రైతులు అగచాట్లు పడాల్సిన పరిస్థితి. మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు 2 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలకు 780 టన్నులు, ప్రయివేటు వర్తకులకు 800 టన్నులు వచ్చినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయినా ఎక్కడా యూరియా సక్రమంగా దొరకని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగా రావడం, మొక్కజొన్న విస్తీర్ణం పెరగడంతో మరో 400 టన్నులు అదనంగా రైతులు వినియోగించారని, దీనివల్ల మండలంలో ఎరువుల కొరత ఏర్పడిందని ఎఒ శ్యామసుందర్ చెబుతున్నారు. ఎరువుల వ్యాగన్లు వారానికి ఒకసారి రావడం కూడా మరో కారణమని, అందుకే ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలియజేశారు.

పొలమే చూసుకొంటామా..

గ్రామంలో పొలం పనులే చూసుకొంటామా? ఎరువుల కోసం తిరుగుతామా? తీరా ఆఫీసుకి వెళ్తే ఎరువులు లేవంటున్నారు. ఇలాగైతే ఎలా సేద్యం చేయాలి.?

- కోరెడ్ల సత్యం, కౌలు రైతు, రాజుపేట

తిరగడం ఇబ్బందిగా ఉంది

నాకు నాలుగు ఎకరాలు పొలం ఉంది. ఈ వర్షాల్లో ఏరు దాటి ఎరువుల కోసం తిరగడం ఇబ్బందిగా ఉంది. తీరా వచ్చినా, తరువాత ఎరువు లేదంటున్నారు.

- గంట సత్యం, రైతు, భోజరాజపురం

ఎరువుల కోసం అగచాట్లు

నెల్లిమర్ల మండలంలో 3800 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. ఈ సమయంలో యూరియా చల్లడం వరిపంటకు చాలా అవసరం. ఎక్కడా యూరియా మాత్రం దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కి యూరియా 780 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 383 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. డిఎపి 440 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 287 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఎంఒపి 540 టన్నులు అవసరం కాగా 58 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 108 టన్నులు అవసరం కాగా 240 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో డిఎపి, ఎంఒపి, కాంప్లెక్స్ ఎరువులు ప్రస్తుతం రైతులకు అవసరం లేదు. ప్రస్తుత పరిస్థితిలో యూరియా కావాలని కోరుతున్నా ప్రభుత్వం సరఫరా చేయక పోవడం రైతులు మండిపడుతున్నారు.

నెల్లిమర్ల మండలంలో ఉన్న 8 రైతు సేవా కేంద్రాలకు యూరియా కోసం వెళ్తే స్టాక్ లేదని చెప్పడంతో ఉసూరుమని వెనక్కి వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రయివేట్ డీలర్ల వద్ద యూరియా ఉన్నా లేదని చెప్పి వారికి ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతున్నట్లు సమాచారం. సతివాడ కేంద్రంగా యూరియా బస్తాపై రూ.100 అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అడపాదడపా వ్యవసాయ, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీల పేరిట హడావుడి తప్ప తమకు న్యాయం జరగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యానికి మించి రుణాలు

- ఐదు నెలల్లోనే రూ.4217.65 కోట్లు
- సేవా రంగంలోనూ విరివిగా సహకారం
- ప్రజాశక్తితో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రమణమూర్తి ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మొదటి ఐదు నెలల్లోనే రూ.4217.65 కోట్లు రుణాలిచ్చామని, లక్ష్యానికి మించి రుణసాయం అందించామని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వివి రమణమూర్తి అన్నారు. ఇందులో వ్యవసాయ రుణ సాయం రూ.2006.38 కోట్ల మేర అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే రూ.1984.37 కోట్ల మేర మంజూరైందని తెలిపారు. పారిశ్రామిక రంగానికి రూ.460.79 కోట్ల రుణ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు లక్ష్యానికి మించి రూ.666.47 కోట్ల వరకు (144.64 శాతం) మంజూరు చేసినట్లు చెప్పారు. సేవా రంగంలోనూ విరివిగా రుణాలు మంజూరు చేశామని వివరించారు. అర్హులైన రైతులందరికీ రుణసాయం అందించేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ద్వారా బ్యాంకర్లకు తగిన ఆదేశాలు పంపామన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. బ్యాంకు రుణాలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

వ్యవసాయ రుణాల లక్ష్యం ఎంత? ఇప్పటి వరకు ఇచ్చింది ఎంత.?

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1125.03 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు రూ.886.27 (78.78 శాతం) వరకు అందించాం. పెట్టుబడి రుణాలు రూ.797.14 కోట్ల లక్ష్యానికి గాను రూ.930.86 కోట్లు (116.77 శాతం) ఇచ్చాం. వ్యవసాయ అనుబంధ రంగాలకు (యంత్రాలు, పనిముట్లు, తదితరాలు) రూ.84.21 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా రూ.167.24 కోట్ల మేర రుణాలు అందించాం.

పరిశ్రమలకు ఏ రకమైన సహకారం అందింది.?



ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు ఈ ఏడాది ఉదారంగానే రుణసాయం అందింది. ముఖ్యంగా సూక్ష్మ పరిశ్రమలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.300.04 కోట్లు కాగా, ఇప్పటికే రూ.406.10 కోట్ల వరకు ఇచ్చాం. చిన్నతరహా పరిశ్రమలకు రూ.109.78 కోట్ల మేర రుణసాయం ఇవ్వాల్సి ఉండగా, లక్ష్యానికి మించి రూ.200.48 కోట్లు (182.62 శాతం) రుణాలు ఇచ్చాం. మధ్యతరహా పరిశ్రమలకు రూ.50.38 కోట్లకు గాను రూ.59.74 కోట్లు (118.58 శాతం) మంజూరైంది.

ముద్ర రుణాలు ఎంతమేరకు ఇచ్చారు.?

ఈ ఏడాది రూ.162 కోట్ల ముద్ర రుణసాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆచరణలో రూ.196.97 కోట్లు (121.59 శాతం) మంజూరైంది. వీటి ద్వారా చిన్న చిన్న దుకాణాలు, తినుబండారాల తయారీ వంటివి పెట్టుకున్నారు. వీటితోపాటు రూ.20లక్షలకు పైబడిన ఇంటి రుణాలు, ఎడ్యుకేషన్ లోన్లు వంటివి కూడా మంజూరు చేశాం.

పిఎం సూర్యఘర్‌కి రుణసాయం ఎలా ఉంది.?

పిఎం సూర్యఘర్ ద్వారా సౌర విద్యుత్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం జిల్లాలో విరివిగా రుణాలు మంజూరు చేశాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 1885 వరకు మంజూరయ్యాయి. విద్యుత్ ఉత్పత్తి స్థాయి కెవి (కిలో వాట్స్) స్థాయిని బట్టి రుణసాయం ఉంటోంది. 1కెవి వరకు రూ.30 వేలు, 1కెవి నుంచి 2కెవి వరకు రూ.60 వేలు, 2కెవి నుంచి 3కెవి వరకు రూ.78 వేల మేర రుణసాయం ఉంటుంది. యూనిట్ విలువలో రూ.90 శాతం రుణసాయం 6.5శాతం వడ్డీతో ఇవ్వనున్నాం. మిగిలిన 10శాతం లబ్ధిదారుడు చెల్లించుకోవాలి. ప్రతి యూనిట్ ఏర్పాటుపై స్థానిక మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ లేదా గ్రామ పంచాయతీలకు రూ.వెయ్యి ప్రోత్సాహకం రూపంలో కేంద్రం తరపున చెల్లింపు జరుగుతోంది.

సేవారత్న పురస్కారంతో సత్కారం

ప్రజాశక్తి - బొబ్బిలి

నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు చిలకలపల్లి శ్రీనివాసరావును ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. వివిధ రంగాలలో సమస్యలు పరిష్కారానికి పని చేస్తున్న వారిని గుర్తించి సన్మానించినట్లు ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షులు వి.సాయిరెడ్డి చెప్పారు. తనను సన్మానించడం ఆనందంగా ఉందని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ప్రాంత నాయకులు గోనా మానస, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - బొబ్బిలి

సీఎం సహాయ నిధి పేదలకు వరంగా ఉందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎం.పనుకువలస గ్రామానికి చెందిన అమరావు సత్యవతికి రూ.59,150, పక్కి గ్రామానికి చెందిన చిట్టి రూపావతికి రూ. లక్షా 227 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.బూర్జవలస సర్పంచ్ సింగనపల్లి ఈశ్వరరావు, టిడిపి నాయకులు బంకురు బాబురావు, పాల్గొన్నారు.

సచివాలయ రహదారి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురం సచివాలయానికి వెళ్లే రహదారి వర్షపు నీటితో జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం ప్రజాశక్తి పత్రికలో ఆగస్టు 28వ తేదీన ప్రచురితమైంది. దీనికి స్పందించిన సర్పంచ్ గొటివాడ దేవి తక్షణమే చర్యలు చేపట్టి, జెసిబి సహాయంతో ఆదివారం కాలువలు తవ్వించి, రహదారిపై నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించారు. దీంతో ఇకపై పాదచారులు, వాహనదారులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రాకపోకలు సాగించగలుగు తున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో ఉన్న సమస్య ఒక్కసారిగా పరిష్కారం కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి, సింగరాయి, జగ్గయ్యపేట, అరిగిపాలెం తదితర గ్రామాలలో చవితి సందర్భంగా ఆదివారం ఘనంగా అన్నదాన కార్యక్రమాలను ఆయా గ్రామాల ప్రజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులు గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - వేపాడ

అధికారులు గ్రామాభివృద్ధికి సహకరించాలని బానాది ఎంపిటిసి గొంప తులసి కోరారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ అధికారుల సేవలు పూర్తిగా అందడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో గ్రామ సచివాల సిబ్బంది బదిలీలు కారణంగా గ్రామ సచివాలయానికి పంచాయతీ కార్యదర్శి నియామకం జరగకపోవడంతో గ్రామంలో ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమాలూ జరగడం లేదన్నారు. సచివాలయంలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి, పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి కూడా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులు నియమించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- వేపాడ

వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మండలంలో పలు ఎరువుల దుఖానాల్లో ఆదివారం తనిఖీలు చేశారు. బొద్దాం శ్రీదేవి ట్రేడర్స్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతికుమారి, విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, హెడ్ కానిస్టేబుల్స్ ఎ.కామేశ్వరరావు, పురుషోత్తంలతో కలిసి తనిఖీ చేశారు. రైతుల పంట విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు విక్రయించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంఆర్‌పి ధరలు కంటే అధికంగా అమ్మకూడదని దుకాణ యజమానులకు సూచించారు. కొండగంగుబూడి ఆర్‌బికెలో ఉన్న డిఎపి ఎరువు స్టాక్‌ను, రిజిస్టర్‌ను కూడా అధికారులు తనిఖీ చేశారు.

బొద్దూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని బొద్దూరులో నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం జేమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వివిధ గ్రామాల నుండి సుమారు 300కి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వాతావరణంలోని మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సిహెచ్ మహేష్ కుమార్, సమతం శ్రీను, ఉపాధ్యాయుడు దామోదరరావు, వైద్య సిబ్బంది, రోగులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతు పనులు

ప్రజాశక్తి - గరివిడి

గోతులను పూడ్చుతున్న కామేశ్వరరావు, తదితరులు

మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామం నుండి చీపురుపల్లి ఫైర్ స్టేషన్ వరకు సుమారు 2 కిలోమీటర్లు తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో గుర్ల పోలీసు స్టేషన్‌లో ఎఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కొండలక్ష్మీపురం గ్రామస్తులు బెల్లాన కామేశ్వరరావు తన సొంత నిధులతో ఆదివారం రోడ్డు గుంతలను పూడ్చి వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తన వంతు భాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టానని చెప్పారు. దీంతో ఆయన్ను పలువురు ప్రయాణికులు అభినందించారు.

అనారోగ్యంతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని సురవరం, పుల్లిట గ్రామాల విఆర్ఒ కొయ్యాన గోపాలరావు (53) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజాం మండలం ముద్దాడజోగివలస గ్రామానికి చెందిన గోపాలరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన ప్రజలకు ఉత్తమ సేవలందించారని సంతకవిటి తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు కొనియాడారు. ఈ మేరకు గోపాలరావు మృతి పట్ల విఆర్ఒల యూనియన్ అధ్యక్షులు పి.అచ్యుతరావు, కోశాధికారి వి.పట్టాభి, జి.రామకృష్ణ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

లారీలను ఢీకొని క్లీనర్ మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

రామవరం ఎన్‌హెచ్ 26 బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీలను మరొక లారీ శనివారం అర్ధరాత్రి ఢీకొనడంతో క్లీనర్ కోన వెంకటరమణ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. గంట్యాడ పోలీసుల వివరాల ప్రకారం.. రామవరం జంక్షన్ దాటిన తర్వాత జిబి కాంక్రీట్ వర్క్స్ దగ్గరలో ఆగి ఉన్న రెండు లారీలను వెనుక నుడి వస్తున్న లారీ టైర్ పేలిపోవడంతో బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదానికి కారణమైన లారీ క్యాబిన్‌లో ఉన్న క్లీనర్ కోన వెంకటరమణ క్యాబిన్‌లో చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునిది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలమని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలం కోరుకొండ, అలమండ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైందని రైల్వే ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. సుమారు 5.5 అడుగుల పొడవు, చామన చాయ రంగులో ఉండి, నలుపురంగుపై చిన్న చిన్న తెలుపు రంగుల పువ్వులు గల ఫుల్‌హ్యాండ్ షార్ట్, నీలంరంగు షార్ట్ ధరించాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ వ్యక్తి సమాచారం ఎవరికైనా తెలిస్తే 9490617089, 6301365605 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమతులు ఉన్నట్టా..లేనట్టా..?

- బొడ్డవలస ఇసుక ర్యాంపుపై అనుమానాలు
- నాగావళిలో జెసిబితో తవ్వకాలు
- సంకిలి, లొంగ గుడ్డులో భారీ స్థాయిలో ఇసుక డంపింగ్
- తాగునీటి ప్రాజెక్టులు, వంతెనలకు పొంచి ఉన్న ప్రమాదం
- బొడ్డవలస, రేగిడి, గదబవలస కేంద్రాలుగా అక్రమ రవాణా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస నాగావళి నదిలో జెసిబి ద్వారా అక్రమంగా రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు చేపట్టడంతో అసలు ఈ ఇసుక ర్యాంపునకు అనుమతులు ఉన్నాయా.. లేవా..! అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాగావళి నది నుంచి జెసిబితో తవ్వకాలు చేపట్టి, ట్రాక్టర్లతో సంకిలి చేపల చెరువు సమీపంలో లొంగ గుడ్డు పొలంలో లక్షలాది రూపాయల ఇసుక డంపింగ్ చేసి లారీలతో విశాఖపట్నం, విజయనగరం, చెన్నై తదితర ప్రాంతాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్నారు. ఉచితమే అని ఇసుక తవ్వకాలతో నాగావళి నది దోచేస్తున్నారు. దీంతో ఇసుకాసురులు లక్షలు, కోట్లు రూపాయలు సంపాదిస్తున్నారు. వీటిలో అధికార పార్టీ బడా నాయకులు హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా ఈ ఇసుక ర్యాంపు వద్ద ఐదు మండలాలకు సరిపడే మూడు పైలెట తాగునీటి ప్రాజెక్టులను ఒక్కొక్కటి 49 కోట్ల రూపాయలతో నిర్మించారు. పాలకొండ - విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో పొడవైన వంతెన ఉంది. భారీ ఇసుక తవ్వకాలు చేపట్టడంతో మూడు మంచినీటి పథకాలు, పొడవైన వంతెన, వచ్చే వరదలకు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రెండిటికి 500 మీటర్ల లోపు ఎటువంటి తవ్వకాలు చేపట్టరాదని ప్రభుత్వాలు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని భేఖాతర్ చేస్తున్నారు. ఇంత జరిగినా మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఇసుకాసురులు లక్షల్లో డబ్బును పోగేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు వారం, వారం మామూలు అందడంతో ఈ ఇసుక దోపిడీని ఆపేవారు లేరనే కదా.. ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని సంబంధిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని బొడ్డవలస, రేగిడి, తునివాడ, ఖండ్యాం పంచాయతీ ఖండ్యాంతో పాటు గదబవలస గ్రామాల కేంద్రాలుగా నాగావళి నదిలో ఇసుక అక్రమంగా తవ్వి వందలాది ట్రాక్టర్లు, లారీలతో పట్టణాలకు తరలించి ఇసుకను దోచేస్తున్నారు. ఈ గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేయడంతో ఇసుకాసురులు ప్రభుత్వ సంపదతో లక్షలాది రూపాయలు సంపాదన చేసి కాసుల పంటగా తయారు చేసుకుని వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందుతుంది. రాత్రులందు జెసిబిలతో లారీలకు ఇసుక ఎత్తి విజయనగరం, విశాఖపట్నం, చెన్నై వంటి పట్టణాలకు అక్రమ రవాణా చేస్తున్నారు.

ప్రమాదకరంగా మారిన వంతెన

పర్యవేక్షణా లోపం

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకీ మితిమిరిపోతున్నారు. ఒక్కొక్క పది టైర్లు లారీకు ఇసుకాసురులు రూ.50వేలు నుంచి రూ.70వేల వరకూ, ఒక్కొక్క లోకల్ ట్రాక్టర్లకు రూ.5వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంపద కాపాడవలసిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ వనరులకు సంబంధించి ఇలా అక్రమ ఇసుక రవాణా చేయడం పట్ల పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు కనీసం పట్టించుకోకపోవడంతో వీరికి కూడా ముడుపులు అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. నాగావళి నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అధికారులకు వారానికి మామ్ముళ్ళ అందుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

సంకిలిలో ఇసుక డంపింగ్ వద్ద జెసిబితో లారీకు ఎక్కిస్తున్న ఇసుక

ఉచితం ఉత్తిదే

మండలంలో ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ నిర్మాణాలు, ఇంటి నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను తరలించుకోవచ్చునని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏ నిర్మాణానికైన డబ్బులు చెల్లించి ఇసుక తీసుకెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. అక్రమార్కులతో ట్రాక్టర్ యజమానులు చేతులు కలిపి ఇసుకను అమ్మేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా ఇసుక దందా మారడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి, పర్యవేక్షణ జరిపి, ప్రభుత్వ సంపదను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ ఐ. కృష్ణలతకు ప్రజాశక్తి ఫోన్లో మాట్లాడగా బొడ్డవలస వద్ద ఇసుక తవ్వకాలు, సంకిలి వద్ద ఇసుక భారీ డంపింగ్ విషయం తనకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారు. ఇంచార్జ్ ఆర్ఐ కిరణ్ కుమార్‌కు అడుగుగా తనకేమీ తెలియదని చెప్పడం కొసమెరుపు. విఆర్ఒను అడుగగా ర్యాంపునకు అనుమతులు ఉన్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులకు తెలియకుండా విఆర్ఒకు తెలిసేలా అనుమతులుంటాయా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు కరువు

- వేలాది రూపాయల ఫీజులు దోపిడీ
- అయినా మౌలిక సదుపాయాలు మృగ్యమే
- అడ్మిషన్లకు ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులపై నిఘా
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి- సంతకవిటి

విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు శాపంగా మారాయి. మండలంలోని 7 ప్రైవేట్ విద్యాసంస్థలలో 1428 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బాగా పెరిగింది. డబ్బుయిచ్చి చదివినా కనీస మౌలిక సదుపాయాలు కరువైయ్యాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఉన్న వైజ్ స్కూల్, శ్రీ సంతోషి హై స్కూల్‌లలో విద్యార్థుల నుండి వేలాది రూపాయల పీజులు వసూళ్లు చేస్తున్నా కనీసం మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. అనర్హత కలిగిన ఉపాధ్యాయులతో పాఠశాలలు కొనసాగిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. శిథిలావస్థకు చేరుకున్న రేకులు షెడ్లు లలో, ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. బాల, బాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మరుగుదొడ్లు విద్యార్థినిలకు మాత్రమే వినియోగిస్తున్నా చాలడం లేదు.

ఆరుబయటే బహిర్భూమి

ఇక బాలురు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మరుగుదొడ్లు లేక చిన్నారులు బహిర్భూమికి, కాళ్ల కృత్యాలు తీర్చుకోవడానికి పిల్ల కాలువలు వైపు బారులు తీస్తున్నారు. వర్షకాలం కావడంతో విద్యార్థులు విష సర్పాలు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సంతకవిటి నుండి పొందూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యార్థులు మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం పాఠశాల యాజమాన్యం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుంది. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో మరి.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల అండ దండలు ఉండడంతో మండల విద్యాశాఖ అధికారులు కనీసం తనిఖీలు కూడా చెయ్యడం లేదు. వైజ్ స్కూల్ విద్యార్థులకు చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ అన్ని లోపలే జరిగిపోతాయి. ఇక్కడ కూడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు నానా అవస్థలుపడుతున్నారు. ఇంగ్లీష్ మీడియం పేరుతో పేద విద్యార్థుల నుండి అధిక పీజులు వసూళ్లు చేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు కంటే.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఈ సంవత్సరం అడ్మిషన్లు జరిగాయి. ప్రైవేట్ పాఠశాలలో సమస్యలు తిష్ట వేసినా మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోయినా.. జిల్లా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

మూత్ర విసర్జనకు తుప్పల్లోకి వెళ్లిన పిల్లలు

బస్సుల పేరిట మరింత దోపిడీ

ఈ పాఠశాలల విద్యార్థుల నుండి బస్సులు పేరుతో మరింత దోపిడీ చేస్తున్నారు. స్కూల్ బస్సుకు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. జిల్లాలోని చివరి మండలమైన సంతకవిటి ప్రైవేట్ పాఠశాలలో ఇంత దారుణం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

మూత్ర విసర్జన కోసం ఆరుబయటకు వెళ్లిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

నూతన విద్యా విధానం అమలు కావడంతో మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేక మూసివేశారు. మరో 26 పాఠశాలలకు ఏకోపాధ్యాయులు ఉన్నారు. మండవకురిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంఖ్య భారీగా తగ్గిపోవటానికి స్థానిక రాజకీయ నాయకుల అండదండలే కారణమని చెబుతున్నారు. వీటి సమీపంలో ఈ ప్రైవేట్ స్కూల్ ఉండడంతో ప్రైవేట్ స్కూల్‌కి పేద విద్యార్థులు బారులు తీరుతున్నారు. దీంతో సర్కార్ బడిలో విద్యార్థులు ఖాళీ అయ్యారు. ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ పిల్లల వద్ద అధిక ఫీజులు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని విద్యావ్యాపారం విచ్చలవిడిగా జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం నిద్ర మత్తులోనే ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

బొత్స గురించి మాట్లాడే అర్హత కళాకు లేదు : బెల్లాన

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మీరు నివశించే ప్రాంతమైన రాజాంకి తాగునీరు తెచ్చుకోలేని మీకు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గురుంచి మాట్లాడే అర్హత లేదని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుపై విరుచుకుపడ్డారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీ కృష్ణలతో కలసి చంద్రశేఖర్ మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మాట్లాడే అర్హత కళా వెంకటరావుకి లేదని, రాజాంలో కూర్చొని ప్రెస్ మీట్లు పెట్టడం కాదని చీపురుపల్లిలో నివాసం ఉంటే ఇక్కడ ప్రజల ఆర్తనాధాలు వినిపిస్తాయని హితవు పలికారు. బొత్సను మాట్లాడే ముందు మీ రాజకీయ జీవితంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి గురుంచి ఏనాడైనా ఆలోచన చేసారా అని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, గిరిజన యూనివర్శిటీ, విజయనగరంలో మెడికల్ కళాశాల వంటివి వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు మంజూరు చేసి నిర్మించలేదా అని ప్రశ్నించారు. యూరియా దొరక్క రాష్ట్రంలో రైతుల ఆర్తనాధాలు వినబడలేదా అని అన్నారు. మీరు గెలిచిన మూడు నియోజకవర్గాల్లో ఎక్కడైనా అభివృద్ధి చేసినట్లు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా చీపురుపల్లిలో రైల్లే బ్రిడ్జి పనులను ఇప్పటికీ పూర్తి చేయలేదని గుర్తు చేశారు. మహిళలకు ఏం చేసారని స్త్రీశక్తి అని విజయోత్సవాలు చేసుకుంటున్నారో చెప్పాలని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు, ఇప్పిలి తిరుమల తదితరులున్నారు.

మాజీ సైనికుల సమావేశం

బొబ్బిలి: బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించి అందరి సహాయ సహకారాలతో విజయవంతమైనందుకు గాను సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాజీ సైనికుల భూ సమస్యలు, ఇళ్ల స్థలాల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, నూతనంగా రిటైర్ అయిన సైనికుల కోసం భూ కేటాయింపుల సమస్యల గురించి చర్చించి, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు. అవసరమైన ప్రభుత్వ సహాయం కోసం ప్రభుత్వ పెద్దలను సంప్రదించి తగిన సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఉపా ధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఎ.గోవింద నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్ మోహన్‌రావు, కోశాధికారి వి.ఎన్ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- రాజాం

సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్‌పి

రాజాం మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో పాటు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ముందుగా రాజాం శ్రీపోలిపల్లి అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేసి అక్కడి నుంచి ర్యాలీగా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు వెళ్లారు. నూతన పాలక మండలి చైర్‌పర్సన్ గురవాణ పార్వతి, వైస్ చైర్‌పర్సన్ లచ్చుభుక్త ధనలక్ష్మి, ఎఎంసి పాలక మండలి సభ్యులు గురవాన ధనుంజయరావు, ఎలకల దుర్గాప్రసాద్, తమ్మినేని ఝాన్సీ, జి.జగన్ మోహన్, బోనుల రమణమ్మ, ఎడ్ల అసిరి నాయుడు, కేత శంకర్, పొన్నాడ భీమేశ్వర రావు, జివి జగన్ బాబు, డబ్బాడ కృష్ణ, లెంక పార్వతి, గుడివాడ చిన్నం నాయుడు మార్కెట్ యార్డు వద్ద ప్రమాణం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకూ టిడిపిలో సముచిత స్థానం ఉంటుందన్నారు. మూడు పార్టీల కలయికతో బలమైన మార్కెట్ యార్డు కమిటీని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, కోండ్రు జగదీష్, గురవాణ నారాయణ రావు, కిమిడి అశోక్ కుమార్, గట్టి భాను, పిన్నింటి మోహన రావు, దూబ ధర్మారావు, మహేష్, వల్లూరి గణేష్, సమతం శ్రీను, లచ్చుభుక్త కృష్ణమూర్తి, అప్పలనాయుడు, కోటగిరి నారాయణ రావు, యూపి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

మాట్లాడుతున్న శంకరరావు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మోటార్ వాహనాల చట్టం తెచ్చి ఆటో కార్మికులకు తీవ్రంగా నష్టం చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకం ద్వారా ఆటో కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా మార్చిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బిటిఆర్ ఎల్లం నాయుడు అన్నారు. ఈ నెల 4న గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపడతామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక బొబ్బిలి ఆటో స్టాండ్‌లో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని కుట్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఫిట్నెస్ బ్రేకు తదితర చలానాలు భారీగా పెంచి ఆటో కార్మికుల కష్టాన్ని దోచుకుంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆటో కార్మికులపై భారీగా జరిమానాలు వేస్తూ 21 జీవో ఇచ్చిందని, ఈ ప్రభుత్వం ఉచిత బస్సు పెట్టి కిరాయిలు లేక ఆటో కార్మికులకు మరింత తీవ్రమైన నష్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ చేపట్టనున్న ధర్నా ప్రదర్శనలో ఆటో కార్మికుల పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మోకాళ్లపై నిరసన

శృంగవరపుకోట: 18 సంవత్సరాలు క్రితం తీసుకున్న భూముల్లో ఎటువంటి పరిశ్రమ పెట్టని వారు చిన్న మధ్య తరహా పరిశ్రమలు పెట్టేస్తాం, ఉపాధి కల్పిస్తాం, అని చెప్తున్న మాటలన్నీ కుట్రపూరితమే అని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. ఆదివారం జిందాల్ నిర్వాసితులు మోకాళ్ళపై నిలబడి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జిందాల్ కంపెనీ యజమాన్యం 'మీరు మాకు భూములు ఇస్తే కంపెనీలు నిర్మించి భూములు ఇచ్చిన వారందరికీ ఉద్యోగాలు ఇచ్చి, కంపెనీలో భూములకు సరి సమానమైన వాటాలు ఇచ్చి మీకు ఉన్నతమైన జీవనం కల్పించి ఆదుకుంటామని' కుట్రపూరిత మాటలు చెప్పి భూమిని మాత్రమే దోచుకున్నారని ఆగ్రహించారు. పైగా ఈ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చి అమ్మేయాలన్న ఆలోచనలో ఉండటం దుర్మార్గమన్నారు. నిరుపేదలైన దళిత గిరిజన పక్షాన కాకుండా అందర్నీ మోసగించేందుకు సిద్ధపడ్డ జిందాల్ యాజమాన్యం తరపున కొంత మంది మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిందాల్ నిర్వాసితులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల



నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మండలంలో సుదీర్ఘ కాలం పనిచేసి, ప్రస్తుతం గరివిడి మండలం చుక్కవలసలో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదవీ విరమణ చేసిన ఎన్ను నాగేశ్వరరావుకు ఘనంగా సన్మానం జరిగింది. ఆయనకు స్థానిక పెట్రోలు బంకు వద్ద ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు అందరూ నాగేశ్వరరావు ఉపాధ్యాయునిగా, సంఘ నాయకునిగా అందించిన సేవలను కొనియాడారు. నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి మండలాల నుండి పెద్దఎత్తున ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్న ఈ సభకు ఈపు విజయ్ కుమార్, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం ఎంఇఒ మాతా చంద్రశేఖర్, గరివిడి ఎంఇఒ 2 అప్పన్న, డెంకాడ ఎంఇఒ 2 చిన్నికృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతకింది ఆనందమూర్తి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్, ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు వై.సత్యం, సదాశివరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, పిఆర్‌టియు నాయకుడు కె.రామకృష్ణ, దత్తిరాజేరు జడ్‌పిటిసి రాజేశ్వరి, దత్తిరాజేరు మాజీ జడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎన్ను కృష్ణమూర్తి, పారసాం ఎంపిటిసి సంగరెడ్డి జగన్నాధం, సోదరులు ఎన్ను బుచ్చంనాయుడు, స్కూల్ అసిస్టెంట్ ఎన్ను నారాయణప్పల నాయుడు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VIZIANAGARAM
I.A.690/2023 in O.S.98/2023

Between:
Sri Pilli Srinivas & 4 others ...Petitioners/Plaintiffs
And
Sri Nadimpalli Suryanarayana Raju & 6 others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Nadimpalli Suryanarayana Raju, S/o. N. China Suryanarayana, aged about 51 years, Permanent R/at Pothukurru Village, Inavilli Mandal, East Godavari Dist-533211, Presently R/at Subhakari Modern Rice Mill, Savaravilli Village, Bhogapuram Mandal, Vizianagaram District-535216.

Take notice that the above numbered I.A.690/2023 in O.S.98/2023 which was filed by the petitioners/plaintiffs against to you and others for declaration and other reliefs, and the same is posted to **15-09-2025.** You are, therefore, required to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **15-09-2025.** in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in yours absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO,
Advocate, Visakhapatnam,
Cell: 9441595993.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VIZIANAGARAM
O.S.98/2023

Between:
Sri Pilli Srinivas & 4 others ...Plaintiffs
And
Sri Nadimpalli Suryanarayana Raju & 6 others ...Defendants

SUMMONS

To,
D-1: Sri Nadimpalli Suryanarayana Raju, S/o. N. China Suryanarayana, aged about 51 years, Permanent R/at Pothukurru Village, Inavilli Mandal, East Godavari Dist-533211, Presently R/at Subhakari Modern Rice Mill, Savaravilli Village, Bhogapuram Mandal, Vizianagaram District-535216.

Take notice that the above numbered O.S.98/2023 which was filed by the plaintiffs against to you and others for declaration and other reliefs, and the same is posted to **15-09-2025.** You are, therefore, required to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **15-09-2025.** in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO,
Advocate, Visakhapatnam,
Cell: 9441595993.